గడప గడపలో అభివృద్ధి

- 'గడప గడపకు' నిధులతో సమస్యలకు చెక్
- మండలంలో రూ.2.17 కోట్లతో సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణం
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు


ముక్త్యాల బీసీ కాలనీలో నిర్మించిన సిమెంట్ రోడ్డు

జగ్గయ్యపేట: గడప గడపకు నిధులతో గ్రామాల్లో మౌలిక వసతులు సమకూరుతున్నాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో ప్రతిష్ఠాత్మకంగా 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం అమలు చేశారు. ఇందులో భాగంగా ప్రతి ఇంటికి వెళ్లి సమస్యలు తెలుసుకోవడం, ప్రభుత్వం ద్వారా లబ్ధిదారుడికి అందిన సంక్షేమ పథకాలను వివరించే కార్యక్రమం చేపట్టారు. అదే క్రమంలో అభివృద్ధికీ పెద్ద పీట వేశారు. ప్రతి సచివాలయానికి రూ.20 లక్షల నిధులు మంజూరు చేశారు. ప్రాధాన్యతా క్రమంలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం జరిగిన గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణంతో సమస్యలకు పరిష్కారం లభించింది. నియోజకవర్గంలో ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే సామినేని ఉదయభాను పలు గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించి క్షేత్రస్థాయిలో మౌలిక వసతులు తెలుసుకుని పరిష్కరిస్తున్నారు.

రూ.2.17కోట్లతో అభివృద్ధి పనులు..

మండలంలోని అన్నవరం, బలుసుపాడు, చిల్లకల్లు–1, 2, కె.అగ్రహారం, ముక్త్యాల, షేర్‌మహ్మద్‌పేట–1, 2, తక్కెళ్ళపాడు, వేదాద్రి, ధర్మవరప్పాడు తండా గ్రామాల్లో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం జరిగింది. గ్రామాల్లో ఎన్నో సంవత్సరాలుగా సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణాలు లేకపోవడంతో అనేక ఇబ్బందులు పడుతున్నామంటూ ఆ ప్రాంత ప్రజలు విప్ ఉదయభానుకు వివరించారు. వెంటనే ఆయన సచివాలయానికి రూ.20 లక్షల వంతున ప్రత్యేక నిధులు కేటాయించారు. యుద్ధ ప్రాతిపదికన వాటి నిర్మాణాలను చేపట్టి అందుబాటులోకి తీసుకువచ్చారు.

మండలంలో రూ.2.17 కోట్లతో చేసిన పనులు

1. సిమెంట్‌రోడ్లు	04	రూ.20.20 లక్షలు
2. కల్వర్టులు	10	రూ.14.70 లక్షలు
3. డ్రెయిన్లు	49	రూ.1.62 కోట్లు
4. పైపులైన్ నిర్మాణం	01	రూ.0.04 లక్షలు
5. విద్యుత్ లైన్‌కోసం	-	రూ.16.10 లక్షలు


షేర్ మహ్మద్‌పేటలోని సాయినగర్‌లో నిర్మించిన డ్రెయిన్

వేగంగా అభివృద్ధి పనులు..



గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం నిధులతో కాలనీల్లో సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణం పూర్తయింది. అంతే కాకుండా చిన్నచిన్న సమస్యలను కూడా వెంటనే పరిష్కరించారు. ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తుందనేందుకు ఇంతకంటే నిదర్శనం ఏముంటుంది.

–యడ్లపల్లి సూర్యప్రకాశరావు, సర్పంచ్, బలుసుపాడు

అడిగిన వెంటనే సీసీ రోడ్డు నిర్మించారు..



గ్రామంలో బీసీ కాలనీలో సీసీ రోడ్డు లేకపోవడంతో కాలనీ వాసులమంతా అనేక ఇబ్బందులు పడుతున్నాం. గ్రామంలో జరిగిన గడప గడపకు మన ప్రభుత్వంలో విప్ ఉదయభాను దృష్టికి తీసుకురావడంతో ఆయన కృషితో సీసీ రోడ్డు నిర్మాణం పూర్తయింది.

–కురుకుల తిరుపతమ్మ, ముక్త్యాల

క్లుప్తంగా

నేడు ఆర్డీవో కార్యాలయంలో 'స్పందన'

నందిగామ: పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం జరుగుతుందని ఆర్డీఓ రవీంద్రరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు స్పందన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిందన్నారు. డివిజన్ పరిధిలోని మండలాల ప్రజలు ఈ కార్యక్రమాన్ని వినియోగించుకోవాలన్నారు.

కంచికచర్ల : ప్రజా సమస్యల పరిష్కార వేదిక 'స్పందన' కార్యక్రమంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10గంటల నుంచి జరుగుతుందని తహసీల్దార్ పబ్బూరి శంకరబాబు ఆదివారం తెలిపారు. గ్రామాల్లో సమస్యలు ఉంటే ప్రజలు అర్జీలు సమర్పించుకోవచ్చన్నారు. వచ్చిన అర్జీలను ప్రాధాన్యతాక్రమంలో పరిష్కరిస్తామని తహసీల్దార్ తెలిపారు.

ఘనంగా ముత్యాలమ్మకు బోనాలు



అనుమంచిపల్లి(జగ్గయ్యపేట): స్థానిక ముత్యాలమ్మ అమ్మవారికి ఆదివారం గ్రామస్తులు బోనాలు సమర్పించారు. పవిత్ర జలాలతో గ్రామంలో డప్పు వాయిద్యాలతో ఊరేగింపుగా మహిళలు పెద్ద సంఖ్యలో తరలివెళ్లి అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. చిల్లకల్లు బీసీ కాలనీ వాసులు ముత్యాలమ్మ అమ్మవారికి బోనాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

అమ్మవారి దర్శనానికి తరలివచ్చిన భక్తులు



పెనుగంచిప్రోలు: స్థానిక శ్రీతిరుపతమ్మవారి దర్శనానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. శ్రావణమాసం ఏకాదశి, సెలవు దినంతో పాటు పలు శుభకార్యాలు ఉండటంతో పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. దీంతో ఆలయ పరిసరాలు కిక్కిరిశాయి. భక్తులు అమ్మవారికి పాలు, పొంగళ్లతో దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి వేల సంఖ్యలో భక్తులు తరలి రావటంతో గ్రామంలో ట్రాఫిక్ సమస్య లేకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

అలరించిన సినీ సంగీత విభావరి

విజయవాడకల్చరల్: శ్రీ స్రవంతి కృష్ణ ఎంటర్‌టైనర్స్ ఈవెంట్స్, తెలుగు కళావాహిని ఆధ్వర్యంలో గాంధీనగర్ కొత్తా పూర్ణానందం కళావేదికపై ఆదివారం నిర్వహించిన తెలుగు, హిందీ చిత్రగీతాల కార్యక్రమం అలరించింది. స్రవంతి కృష్ణ నేతృత్వంలో గాయనీ గాయకులు మల్లాది స్వాతి, ఋగ్వేదం పద్మశ్రీ, ఋగ్వేదం కృష్ణ, కె.దుర్గానాగమణి, శ్రీనివాసరావు తెలుగు హిందీ చిత్రగీతాలను ఆలపించారు. గాయకుడు మచిలీపట్నానికి చెందిన సునీల్‌ను నిర్వాహకులు సత్కరించారు. తెలుగు కళావాహిని అధ్యక్షుడు చింతకాయల చిట్టిబాబు మాట్లాడుతూ.. గాయనీ గాయకుల్లోని ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాల్సిన అవసరముందన్నారు. సంస్థ అధ్యక్షుడు స్రవంతి కృష్ణ సంస్థ లక్ష్యాలను వివరించారు. వివిధ రంగాలకు చెందిన కేఎస్ఎన్ మూర్తి, డేవిడ్ రాజు, బీవీ వీరభద్రరావు, కారుమంచి రాజు తదితరులు పాల్గొన్నారు.

'ఆడుదాం ఆంధ్రా'కు దరఖాస్తుల ఆహ్వానం

పటమట(విజయవాడతూర్పు): రాష్ట్రంలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించేందుకు అక్టోబర్ 2 నుంచి నవంబర్ 8వ తేదీ వరకు రాష్ట్ర ప్రభుత్వం 'ఆడుదాం ఆంధ్రా' కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 11 వేల గ్రామ సచివాలయాలు, 4 వేల వార్డు సచివాలయాల్లో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. క్రీడల్లో పాల్గొనడానికి సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా క్రికెట్, బ్యాడ్మింటన్, వాలీబాల్, కబడ్డీ, ఖో ఖో పోటీలు నిర్వహిస్తామని చెప్పారు. 15 ఏళ్లు దాటిన యువత ఈ పోటీల్లో పాల్గొనేందుకు అర్హులని, ఇందులో వలంటీర్లు, సచివాలయం సిబ్బంది, ప్రభుత్వ ఉద్యోగులు అనర్హులని పేర్కొన్నారు. ఆయా పోటీల్లో గెలుపొందిన విజేతలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా బహుమతులు అందజేస్తామన్నారు. మొదటి బహుమతి రూ.50 వేలు, రెండు, మూడు బహుమతులు వరుసగా రూ.30 వేలు, రూ.20 వేలు నగదు బహుమతులు అందిస్తారని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 15 వేల సచివాలయాల పరిధిలో తొలుత పోటీలు ప్రారంభమవుతాయని, అనంతరం మండల, నియోజకవర్గం, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో పోటీలు నిర్వహిస్తామన్నారు. ఈ పోటీలను నగర వాసులు సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ కోరారు.

13 బైకులు, రెండు ఆటోలు సీజ్


పట్టుబడిన వాహనాలతో ఎస్ఐ రామారావు, పోలీసులు

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలో శనివారం రాత్రి పోలీసులు నిర్వహించిన నాకా బందీ తనిఖీలలో 13 మోటారు సైకిళ్లు, రెండు ఆటోలను సీజ్ చేసినట్లు పట్టణ ఎస్ఐ బీవీ.రామారావు తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ విజయవాడ ఇన్‌చార్జ్ సిటీ పోలీస్ కమిషనర్ అశోక్‌కుమార్ ఐపీఎస్, డీఐజీ ఏలూరు రేంజ్ ఆదేశాల మేరకు, డీసీపీ అజిత పర్యవేక్షణలో, నందిగామ ఏసీపీ జనార్దన నాయుడు, సీఐ జానకీరామ్ ఆధ్వర్యంలో శనివారం రాత్రి 11 గంటల నుంచి ఒంటి గంట వరకు నాకాబందీ ఆదేశాలు జారీ చేశారని తెలిపారు. సిబ్బందితో స్థానిక పాత మున్సిపల్ కార్యాలయం కూడలిలో వాహనాలను తనిఖీ చేయగా, రికార్డులు లేకుండా తిరుగుతున్న మోటారు సైకిళ్లను, ఆటోలను సీజ్ చేసినట్లు తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడుపుతున్న ఇద్దరిని అదుపులోకి తీసుకున్నామన్నారు. సీజ్ చేసిన వాహనాల విషయంలో చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

వైభవంగా సామూహిక కుంకుమార్చన


సామూహిక కుంకుమార్చనలో మహిళలు

నందిగామ: పట్టణంలోని మరిడి మహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో శ్రావణమాసం, ఏకాదశి నేపథ్యంలో ఆదివారం విశేష పూజలు జరిగాయి. వేకువ జామునే ఆలయంలోని అమ్మవారి మూలవిరాట్‌కి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అనంతరం పలు రకాల విశేష పూజలతో పాటు సామూహిక కుంకుమ పూజలు చేశారు. ఆయా పూజా కార్యక్రమాలలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి


మాట్లాడుతున్న రత్నం

కంచికచర్ల : విద్యార్థులు, యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని అప్పుడే జీవితంలో అనుకున్న గమ్యాన్ని చేరవచ్చని డాన్‌బోస్కో నవజీవన్ బాల భవన్ స్వచ్ఛంద సంస్థ జిల్లా కో ఆర్డినేటర్ మేరుగు రత్నం అన్నారు. మండలంలోని మోగులూరు గ్రామంలో పాస్టర్ బంకా నెహెమ్యా అధ్యక్షతన ఆదివారం జరిగిన సమావేశంలో చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రత్నం మాట్లాడుతూ మహిళలు, బాలికలపై అఘాయిత్యాలు జరుగకుండా నియంత్రించేందుకు ప్రభుత్వం దిశ చట్టాన్ని తీసుకువచ్చిందన్నారు. ప్రతి ఒక్కరూ దిశా యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని రిజిస్టర్ చేయించుకోవాలని సూచించారు. తల్లిదండ్రులు తమ పిల్లలను చదివించినప్పుడే వారి భవిష్యత్‌కు బంగారు బాట వేసినవారవుతారని అన్నారు. కార్యక్రమంలో మహిళలు పాల్గొన్నారు.

వృద్ధుడి అదృశ్యంపై ఫిర్యాదు

సత్యనారాయణపురం(విజయవాడపశ్చిమ): ఇంటి నుంచి బయటకు వెళ్లిన వృద్ధుడు తిరిగి రాకపోవడంతో అతని కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఎస్‌పురం పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. వారు తెలిపిన వివరాల ప్రకారం రైల్వే రిటైర్డ్ ఉద్యోగి కాస త్రిమూర్తులు(71) అతని భార్య కేదారేశ్వరపేట లోని 6వ లైన్‌లో కుమారుడి కుటుంబంతో కలిసి నివాసముంటున్నారు. ఈ క్రమంలో ఈ నెల 23న త్రి మూర్తులు భార్యతో కలిసి రైల్వే ఆస్పత్రిలో మందులు తీసుకుని రైల్వేస్టేషన్ సమీపంలోని ఆర్ఈ కాలనీలోని ఉంటున్న కూతురు ఇంటికి వెళ్లారు. రాత్రి 8.30 గంటల సమయంలో త్రిమూర్తులు ఇంటి నుంచి బయ టకు వెళ్లి ఎంతకు తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు అన్ని చోట్ల వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో త్రిమూర్తులు కుమారుడు కాస వెంకటకుమార్ ఆదివారం ఎస్ఎస్‌పురం పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. తన తండ్రికి మానసిక స్థితి సరిగా ఉండదని, గతంలో కూడా ఇంటి నుంచి వెళ్లిపోయి కొండపల్లిలో దొరికినట్లు ఫిర్యాదులో పేర్కొన్నాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

ఠాగూర్ గ్రంథాలయంలో సంగీత శిక్షణ



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): బందరు రోడ్డులోని ఠాగూర్ స్మారక గ్రంథాలయం నందు చదవడం మాకిష్టం కార్యక్రమంలో భాగంగా సరస్వతీ సామ్రాజ్యం ఆధ్వర్యంలో ఆదివారం విద్యార్థులకు సంగీత శిక్షణ తరగతులు నిర్వహించారు. సంగీత శిక్షకురాలు ఎం.దివ్య మాధురి విద్యార్థులకు సంగీతంపై అవగాహన కల్పించారు. సరళి స్వరాలు అనే అధ్యాయంతో తరగతులు ప్రారంభించారు. దివ్య, మాధురి మాట్లాడుతూ సరళి స్వరాలు, సంగీతంలో వాటి ప్రాముఖ్యతపై అవగాహన పెంచుకోవాలన్నారు. సరళి స్వరాలు ఎలా రాయాలి? పంచ స్థా యిలను వివరించారు. నోటేషన్ రాసే విధానం, దా ని ఆవశ్యకతను తెలియజేశారు. స్థాయిల్లో మధ్య, తారా, మంద్ర, అనుమంద్ర, అతితార స్థాయిలు వివరించారు, సప్త స్వరాలు పలికే విధానాన్ని విద్యార్థులకు తెలిపారు. విద్యార్థుల చేత సప్త స్వరాలు పలికించి సాధన చేయించారు. తరగతిలో నేర్చుకున్న అంశాలపై ఇంటి వద్ద సాధన చేయాలని సూచించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి కె.రమాదేవి, సిబ్బంది వై.ధనలక్ష్మి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నందిగామ: పట్టణంలోని పలు ప్రాంతాల్లో సోమవారం నాలుగు గంటలపాటు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆ శాఖ ఏఈ దిబ్బయ్య ఆదివారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లైన్ల మరమ్మతుల నేపథ్యంలో పట్టణంలోని గాంధీ సెంటర్, వాసవి మార్కెట్, పెద్ద మసీద్ ఏరియా, గవర్నమెంట్ హాస్పటల్ రోడ్డు, చేపల మార్కెట్, మధిర రోడ్డు, చందర్లపాడు రోడ్ ప్రాంతాల్లో ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. వినియోగదారులు సహకరించాలన్నారు.

మాతృభాష పరిరక్షణ అందరి బాధ్యత



మొగల్రాజపురం(విజయవాడతూర్పు): తెలుగు మాతృభాష పరిరక్షణ మన అందరి బాధ్యత అని అభ్యుదయ రచయితల సంఘం(అరసం) రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొప్పర్తి రాంబాబు అన్నారు. స్థానిక ప్రజాశక్తి నగర్‌లోని చంద్ర రాజేశ్వరరావు గ్రంథాలయంలో గిడుగు రామ్మూర్తి జయంతి సందర్భంగా తెలుగు భాష దినోత్సవం ఆదివారం జరిగింది. రాంబాబు మాట్లాడుతూ.. తెలుగు అనే పదంలోనే ఎంతో మాధుర్యం ఉందన్నారు. తెలుగు భాష అమ్మదనం నిండిన కమ్మనైన భాష అన్నారు. మాతృభాష ద్వారానే మనలోని భావాలను స్పష్టంగా వ్యక్తపరచగలమని చెప్పారు. తెలుగు భాషలోని పద్యాలు, కవితలు, గేయాలు, చందస్సు వాటికవే సాటి అని అన్నారు. దేశ భాషలందు తెలుగులెస్స అని శ్రీకృష్ణదేవరాయలు అన్నారని గుర్తు చేశారు. సంఘం సభ్యులు కొండపల్లి మాధవరావు, అజయ్ కుమార్, అరుణ్‌కుమార్, పి.చంద్రా నాయక్, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

28 మంది జూదరుల అరెస్ట్

పాయకాపురం(విజయవాడరూరల్): నున్న గ్రామంలో పలతిప్ప వద్ద కోడిపందేలు నిర్వహిస్తున్న 15 మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు.. నున్న గ్రామస్తుల నుంచి అందిన సమాచారం మేరకు పలతిప్ప వద్ద మామిడితోటలో కోడిపందేలు వేస్తున్న శిబిరంపై దాడి చేశామన్నారు. 15 మందిని అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ.13,820, రెండు కోడిపుంజులను స్వాధీనం చేసుకున్నామన్నారు. 15 మందిపై కేసు నమోదు చేశామని చెప్పారు.

మధురంగా అన్నమయ్య సంకీర్తనాధార

విజయవాడకల్చరల్: దృశ్యవేదిక సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో గాంధీనగర్ హనుమంతరాయ గ్రంథాలయంలో నెల వారీ కార్యక్రమంలో భాగంగా ఆదివారం నిర్వహించిన అన్నమయ్య సంకీర్తనాధార, కూచిపూడి నృత్యహేల మధురంగా సాగింది. యువ గాయనీమణులు ఒ.విష్ణుప్రియ, సాయి ప్రజ్ఞ తాళ్లపాక అన్నమాచార్యుడు రచించిన పద కవితులను ఆలపించారు. మృదంగంపై పీవీ ప్రసాద్, వయోలిన్‌పై పాణ్యం దక్షిణామూర్తి సహకరించారు. కూచిపూడి నృత్యహేల కార్యక్రమంలో భాగంగా నాట్యాచార్యులు అజయ్‌కుమార్, ఎ.సంతోష్, యల్లా జోస్యుల అనూరాధ, లేఖ్యాభరణి తమ బృందాలతో నృత్యాభిషేకం చేశారు. దృశ్య వేదిక వ్యవస్థాపకుడు హెచ్‌వీఆర్ఎస్ ప్రసాద్ మాట్లాడుతూ.. పద కవితకు ఆద్యుడు తాళ్లపాక అన్నమాచార్యుడని అభివర్ణించారు. కార్యక్రమంలో దృశ్యవేదిక నిర్వాహక సంఘ సభ్యులు పద్మశ్రీ హేమంత్, బి.నరేన్, మాజేటి సురేంద్రనాథ్ పాల్గొన్నారు.

ఐక్య పోరాటాలతోనే సమస్యల పరిష్కారం

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): సమస్యల సాధన కోసం అంగన్‌వాడీ వర్కర్ల సంఘాలు అన్నీ ఐక్యంగా ఉద్యమించాలని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు జి.ఓబులేసు పిలుపునిచ్చారు. ఏఐటీయూసీ, ఐఎఫ్‌టీయూ, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ సంఘాల ఆధ్వర్యంలో సిద్ధార్థ ఆడిటోరియంలో అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ రాష్ట్ర సదస్సు ఆదివారం జరిగింది. ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు పి.ప్రసాద్ మాట్లాడుతూ అంగన్‌వాడీలకు కనీస వేతనాలు, పీఎఫ్, ఈఎస్ఐ, పింఛన్ ఇవ్వాలన్నారు. సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి వెంకటేశ్వర్లు, ఆంధ్రప్రదేశ్ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.ప్రేమ, ఏపీ ప్రగతిశీల అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జి.భారతి మాట్లాడుతూ.. ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు.

పార్కింగ్ కష్టాలు తీర్చండి సారూ..!


ఆలయం చుట్టూ నిలిపిన వాహనాలు

పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీతిరుపతమ్మవారి ఆలయం వద్ద భక్తులకు పార్కింగ్ కష్టాలు ఇబ్బంది కలిగిస్తున్నాయి. ఆదివారం వందలాది వాహనాల్లో భక్తులు ఆలయానికి తరలివచ్చారు. ఆలయం చుట్టూ వాహనాలు నిలిపి ఉంచారు. దీంతో భక్తులు ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేసేందుకు అనేక అవస్థలు పడ్డారు. గతంలో ఆలయం పక్క టాయిలెట్ బ్లాక్ వెనుక పార్కింగ్ ఏర్పాటు చేసేవారు. అక్కడ నూతనంగా కేశఖండనశాల నిర్మాణంలో ఉంది. అలాగే అమ్మవారి వార్షిక కల్యాణం జరిగే ప్రాంతంలో వర్షాలకు అంతా బురద, గుంతలు పడటంతో ఆలయం చుట్టూ సీసీ రోడ్డుపైనే వాహనాలు నిలపాల్సిన పరిస్థితి ఏర్పడింది. ముఖ్యంగా శుక్ర, ఆదివారాల్లో పార్కింగ్ ఇబ్బందులు తప్పటం లేదు. ఆలయానికి వాహనాల పార్కింగ్‌కు ప్రత్యేకంగా స్థల కేటాయింపు ఉండాలని భక్తులు అంటున్నారు. దీనిపై ఆలయ ఈఓ కె.రమేష్‌నాయుడును వివరణ కోరగా త్వరలో పార్కింగ్ ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఆలయం ముందు స్థలాన్ని పూర్తి స్థాయిలో వినియోగంలోకి తెస్తామన్నారు.

ఆలయాల్లో శ్రావణ మాస పూజలు

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని పలు అమ్మవారి ఆలయాలలో రెండో ఆదివారం సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని శ్రావణమాస ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక అద్దాల బజారులో ఉన్న శ్రీ మహాలక్ష్మి అమ్మవారి వెండిదేవాలయం, నకాశిబజారులో ఉన్న శ్రీకనకదుర్గ అమ్మవారి ఆలయం, దుర్గాపురంలో ఉన్న శ్రీదుర్గామల్లేశ్వరస్వామి తదితర ఆలయాల్లో అమ్మవారు ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చారు. కోదాడ రోడ్‌లోని పుట్టబజారులో కలకత్తా కాళీమాత విశ్వరూప శివ దుర్గాభవానీ మాతకు నిమ్మకాయలు, వివిధ రంగుల పూలదండలతో అలకరణ చేశారు. పట్టణంలోని శ్రీముత్యాలమ్మ అమ్మవారి ఆలయంలో రెండో ఆదివారం ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని శాకంబరి దేవిగా అలంకరించారు. పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలువురు తమ మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం సాయిబాబా భక్త బృందం వారిచే భక్తి గీతాల సంగీత కచేరీ నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు అప్పన మణికుమార్, కొత్తా రమేష్‌కుమార్, కార్యవర్గ సభ్యులు నోముల శివకుమార్, కొంకిమళ్ల సురేష్, అప్పన పిచ్చయ్య, మొరిశెట్టి నాగేంద్రం పాల్గొని ఏర్పాట్లను పర్యవేక్షించారు. వెండిదేవాలయం ఆలయ కమిటీ చైర్మన్ అత్తులూరి వెంకటేశ్వర్లు, శ్రీకనకదుర్గ అమ్మవారి ఆలయ ప్రైవేటు ఇంప్రూవ్‌మెంటు కమిటీ సభ్యులు, దుర్గామల్లేశ్వరస్వామి ఆలయ కమిటీ సభ్యులు, ముత్యాలమ్మ ఆలయంలో కమిటీ సభ్యులు అప్పన మణికుమార్, కొత్తా రమేష్‌కుమార్ తదితరులు పాల్గొని ఏర్పాట్లను పర్యవేక్షించారు.

టీడీపీ నేతల విమర్శలు వాస్తవదూరం

వైఎస్సార్ సీపీ నాయకులు


మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

జుజ్జూరు(వీరులపాడు): పరిపాలనా సౌలభ్యం కోసం మండల కేంద్రాన్ని మార్చేందుకు కృషి చేసిన ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు, ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణకుమార్‌లపై టీడీపీ నాయకులు విమర్శలు చేయటం సిగ్గుచేటని వైస్ ఎంపీపీ షేక్ నాగుల్‌మీరా, పీఏసీఎస్ చైర్మన్ పూలా రాంబాబులు పేర్కొన్నారు. మండలంలోని జుజ్జూరు ప్రెస్‌క్లబ్‌లో పలువురు నాయకులతో కలిసి ఆదివారం రాత్రి వారు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల తరలింపు రాత్రికి రాత్రి జరిగింది కాదని క్యాబినెట్‌లో ఆమోదం పొంది చట్ట ప్రకారం జరిగిందన్నారు. చేసే విమర్శలు వాస్తవానికి దగ్గరగా ఉండాలి కానీ వాస్తవ దూరం, రాజకీయాల కోసమే విమర్శలు చేశామన్నట్లు ఉండకూడదని హితవు పలికారు. జుజ్జూరు మండల కేంద్రంగా మార్పు చెందిందని అభివృద్ధికి సహకరించాల్సిన ప్రతిపక్షాలు అడుగడుగునా అడ్డుతగలటం మంచి పద్ధతి కాదన్నారు. టీడీపీ నేతల చర్యలను, మాట్లాడుతున్న మాటలను ప్రజలు గమనిస్తున్నారని చెప్పారు. మండల కేంద్ర తరలింపుపై అన్ని పార్టీల నాయకులకు ఆహ్వాన కమిటీ సమాచారం ఇచ్చిందని చెప్పారు. ఈ సమావేశంలో నాయకులు రమావత్ రాము, కాసూరు వెంకట్, గోపిశెట్టి నరసింహారావు, పరిటాల రాజు, శాంత, పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన


రోగులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

భవానీపురం(విజయవాడపశ్చిమ): పేదల కోసం నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని, తద్వారా వేలాది రూపాయలతో బయట చేయించుకునే వైద్య పరీక్షలను ఉచితంగా చేయించుకుని వైద్యుల సలహాలు, సూచనలతో ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని పబ్లిక్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ డైరెక్టర్ డాక్టర్ వి.రామిరెడ్డి అన్నారు. విమ్స్ ఫిజియోథెరపీ కాలేజీ అండ్ హాస్పిటల్స్ చైర్మన్ అర్జునరావు ఆధ్వర్యంలో ఆదివారం గొల్లపూడి సాయి పవన్ కాలనీలో ఏర్పాటు చేసిన ఆర్థో, న్యూరాలజీ, గైనకాలజీ, ఫిజియోథెరపీ వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. రామిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. లయన్స్ క్లబ్ విజయవాడ ఈస్ట్, విమ్స్ కాలేజీ, అప్నా సంయుక్తంగా నిర్వహించిన ఈ ఉచిత వైద్య శిబిరంలో గొల్లపూడి, పరిసర ప్రాంతాల గ్రామప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకున్నారు.

వెయ్యి మందికి పైగా పరీక్షలు

ఈ సందర్భంగా డాక్టర్ రామిరెడ్డి మాట్లాడుతూ పేద ప్రజల ఆరోగ్య సంరక్షణకు ప్రభుత్వం డాక్టర్ వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రాలు, విలేజ్ హెల్త్ క్లినిక్స్ ఏర్పాటు చేసి ఉచిత వైద్య సేవలు అందిస్తోందన్నారు. నిరు పేదలకు ఉచిత వైద్య సేవలు అందించేందుకు వైద్య శిబిరాలు నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు. శిబిరంలో వెయ్యి మందికి పైగా వైద్య పరీక్షలు చేయించుకున్నారన్నారు. వైద్య శిబిరాన్ని లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ (316డి) జెఎస్ శంకర్ గుప్తా ప్రారంభించగా ఫాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డి.గోపీనాథ్, క్యాంప్ డైరెక్టర్ డాక్టర్ బి.హనుమయ్య, ఫిజియోథెరపీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ రమేష్, లయన్స్ క్లబ్ ఈస్ట్ కార్యదర్శి రఘురామ్ శర్మ పాల్గొన్నారు.

జీవన శైలి, ఆహారపు అలవాట్లలో మార్పు అవసరం


సదస్సులో మాట్లాడుతున్న వైద్యురాలు భారతి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): జీవన శైలి, ఆహారపు అలవాట్లలో మార్పుల కారణంగా అనేక రుగ్మతలు సంభవిస్తాయని వైద్యురాలు భారతి అన్నారు. బందరు లాకుల సమీపంలోని స్వాతంత్ర్య సమరయోధుల భవనంలో మదర్ థెరీసా జయంతిని పురస్కరించుకుని ఆదివారం జిల్లా సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్, సెయింట్ ఆంథోనీ ఆరాధ్య మెడికల్ సర్వీస్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఊపిరితిత్తులు, మధుమేహం వ్యాధులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో పాల్గొన్న వైద్యురాలు భారతి మాట్లాడుతూ.. వయస్సు రీత్యా ఆహారపు అలవాట్లలో మార్పులు చేసుకోవాలని సూచించారు. రక్తపోటు, మధుమేహం వంటివి అత్యంత ప్రమాదకరమని పేర్కొన్నారు. అన్ని వ్యాధులకు ఆహారంలో తీసుకునే ఉప్పు, పులుపు, మసాలాలు వంటివే కారణమన్నారు. వాటి వాడకాన్ని నియంత్రించాలని సూచించారు. వృద్ధాప్యంలో వైద్యుని పర్యవేక్షణలో అవసరమైన చికిత్సలు చేయించుకోవాలన్నారు. వృద్ధులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. సదస్సులో సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వేమూరు బాబూరావు, ప్రధాన కార్యదర్శి మోతుకూరి వెంకటేశ్వరరావు, వల్లూరి రామారావు, వైద్యులు సుబ్బారావు, ప్రమోద్ కుమార్, వివేక్ పాల్గొన్నారు.